దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో బోధించుటకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కాలేజీలోని హిందీ, ఇంగ్లిష్, గణితశాస్త్రం, స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డా.గంగాధర్ తెలిపారు.

పీహెచ్‌డీ జాబితా విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్లు సాధించిన విద్యార్థుల జాబితా విడుదల పై అధికారులు మౌనం వహిస్తున్నారు. జూలై 19న విడుదల కావాల్సిన జాబితాను ఇంత వరకు వెల్లడించలేదు. జాబితాను విడుదల చేయాలని విద్యార్థులు కోరగా వివిధ కారణాలను చూపుతూ రెండు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. జాబితా విడుదలకు అన్ని అడ్డంకులు తొలిగి, చివరకు డీన్లతో స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన తర్వాత కూడా జాబితాను వెల్లడించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీసీ ప్రొ.కుమార్ వెంటనే స్పందించి జాబితాను విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

టీ తాగుతూ.. విద్యార్థులతో ముచ్చటిస్తూ



ఉస్మానియా యూనివర్సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు గురువారం యూనివర్సిటీలో పర్యటించారు. ఓల్డ్‌పీజీ హాస్టల్ వద్ద విద్యార్థులు, అధ్యాపకులతో కూర్చొని టీ తాగుతూ వివిధ అంశాల పై చర్చించారు. రాష్ట్రానికి విద్య గుండెకాయ లాంటిదని సీఎం రేవంత్ రెడ్డి వర్సిటీల పై సవతితల్లి ప్రేమ కాకుండా అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. దేశంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా ఓయూ నుంచి స్పందించే వాళ్లని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సీఎంల నిర్లక్ష్యంతోనే ఓయూ అధ్వానంగా మారిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.రామకృష్ణ, ఏబీవీపీ నాయకులు పడిడిపల్లి శ్రీహరి, జీవన్, పృథ్వీతేజ, దృహన్ పాల్గొన్నారు.

త్వరలో మార్కెట్‌కు తాగునీటి సదుపాయం



సీఈఓ మధుకర్ నాయక్‌కు చెక్కు అందజేస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డుకు ఎట్టకేలకు తాగునీటి సదుపాయం కలుగనుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు తెలిపారు. యార్డులో తాగునీటి పైపులైన్ వేసేందుకు అవసరమైన రూ.55 లక్షల నిధులను మార్కెటింగ్ శాఖ ఇటీవలే విడుదల చేసిందన్నారు. సంబంధిత చెక్కును మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వెంకన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డీబీ దేవేందర్, ఇతర సభ్యులతో కలిసి కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు అందజేశారు. త్వరలోఏ తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తామని సీఈఓ పేర్కొన్నారు.

ఓయూ నుంచి నలుగురికి ఉత్తమ అధ్యాపక పురస్కారాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నుంచి నలుగురు వర్సిటీ ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. ఆర్ట్స్ కాలేజీ ఎకనామిక్స్ విభాగం సీనియర్ అధ్యాపకులు ప్రొ.సుధాకర్ రెడ్డి, సైన్స్ కాలేజీ మైక్రోబయోలజీ విభాగం ప్రొ.బూర్గుల సందీప్త, ఇంజినీరింగ్ కాలేజీలోని బయో మెడికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి డా.శరణ్య, ఈసీఈ నుంచి ప్రొ.రాజేంద్రనాయక్ ఈ ఏడాది (2025) ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకోనున్నారు. నేడు (5న) శిల్పారామం కళావేదికలో జరిగే టీచర్స్ డే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు ఓయూ అధికార వర్గాలు పేర్కొన్నారు.

దీవించయ్యా.. గణపయ్యా



టకారాబస్తీలో గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

గణపతి నవరాత్రి ఉత్సవాలు సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం ఆయా మండపాల్లోని బొజ్జ గణపయ్యలను భక్తులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా మారాయి. పలు ప్రాంతాల్లో గణనాథుల నిమజ్జనాలను జోరుగా నిర్వహించారు.

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్లబృందం



శాంతినగర్‌లో గణనాథుడి మండపంలో యజ్ఞహోమం



అకీషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలకలగూడలో ఏర్పాటు చేసిన గణనాథుడికి లక్ష ఫలాలతో అర్చన



మాణికేశ్వర్‌నగర్‌లో వినాయక పూజలో పాల్గొన్న కాంగ్రెస్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఆలకుంట లింగయ్య, తులసీరామ్



లాలాపేటలో వినాయక పూజల్లో పాల్గొన్న సుక్క గణేశ్‌రావు



రెజిమెంటల్‌బజార్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్ మధుకుమార్



అశోక వ్యాయామశాల గణనాథుడికి పూజలు చేస్తున్న సిద్దేశ్వర్



మెట్టుగూడలో..



అశోక్‌నగర్‌లో నిమజ్జనానికి తరలిన గణనాథుడు



బ్రాహ్మణ బస్తీలోని గణపతిని దర్శించుకున్న ఏసీపీ శశాంక్ రెడ్డి



సీతాఫల్‌మండిలో గణనాథుడి పూజలో పాల్గొన్న మేకల సారంగపాణి



అమీర్‌పేట్ లీలానగర్‌లోని శివలీలా అపార్ట్‌మెంట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడు



పూజల్లో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి



బల్కంపేటలో డీజీపీ విజయ్‌కుమార్ పూజలు



అడ్డగుట్టలో ప్రతిష్ఠించిన గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు



ప్రశాంత్‌నగర్ కాలనీలో..



లాలాపేట సత్యానగర్‌లో గణపతి హోమంలో పాల్గొన్న మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తిరుమల రేణుక

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమంటూ భార్య ఫిర్యాదు

అమీర్‌పేట: తన భర్త మృతికి కాంట్రాక్టర్ కారణమంటూ ఆరోపిస్తూ మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా రామవరప్పాడుకు చెందిన రౌతు దుర్గారావు (33) సునీత దంపతులు చింతల్‌తో నివాసముంటున్నారు.పెయింటర్‌గా పనిచేసే దుర్గారావు ఈ నెల 2న బల్కంపేట ప్రగతి అపార్టమెంట్‌లో పెయింట్ చేస్తూ భవనంపై నుంచి కింద పడి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుర్గారావు మృతికి అతడితో కలిసి పనిచేసిన ప్రభు ప్రసాద్ ,కాంట్రాక్టర శ్రీనివాస్ కారణమని భార్య సునీత ఆరోపించింది. ఎలాంటి రక్షణ లేకుండా పనులు చేపడుతుండటంతో తన భర్త మృతి చెందాడని ఫిర్యాదు చేసింది.

'గాంధీ' పెయిన్‌క్లినిక్ ప్రొసీజర్ రూమ్ ప్రారంభం



ప్రొఫెసర్ పద్మావతిని సన్మానిస్తున్న వైద్యులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి అనస్థీషియా విభాగంలో పెయిన్ క్లినిక్ ప్రొసీజర్ రూమ్‌ను గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎన్ రాజకుమారి, అనస్థీషియా హెచ్‌ఓడీ ఆవుల మురళీధర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఐదు నెలల క్రితం ప్రారంభమైన పెయిన్ క్లినిక్‌ను దశలవారీగా అప్‌గ్రేడ్ చేసినట్లు వివరించారు. దీర్ఘకాల మొండినొప్పులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు తగిన సదుపాయాలు, సౌకర్యాలు సమకూర్చినట్లు తెలిపారు. పెయిన్ క్లినిక్ ప్రొసీజర్ రూమ్‌కు అవసరమైన సీఆర్మ్, ఓటీ టేబుల్, లైట్, మోనిటర్ తదితర రూ. 20 లక్షల విలువైన వైద్యయంత్రాలు, పరికరాలను వితరణగా అందించిన ప్రొఫెసర్ పద్మావతి రాఘవేంద్రరావుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాంధీ అనస్థీషియా మాజీ హెచ్‌ఓడీ ఉపేంద్రగౌడ్, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి, ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీలు ప్రొఫెసర్ సుబోధ్‌కుమార్, శ్రీనివాస్, వైద్యులు కిరణ్‌మాదల, అబ్బయ్య, మదన్‌మోహన్, చంద్రావతి, రవికుమార్‌లతోపాటు అనస్థీషియా వైద్యులు పాల్గొన్నారు.

డిప్లొమా సీటు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

లాలాపేట: డిప్లొమా సీటు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని ముఖం చాటేసిన ఓ వ్యక్తిపై ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి తిరుపతి అనే వ్యక్తి డిప్లొమా సీటు ఇప్పిస్తానని చెప్పి రంగారెడ్డి జిల్లా జన్వాడ గ్రామానికి చెందిన శ్రీరాములు గౌడ్ నుంచి గత ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో రూ. 65 వేలు వసూలు చేశాడు. సీటు విషయమై సదరు వ్యక్తి శ్రీరాములు గౌడ్ అడిగితే అతను వాయిదా వేస్తూ వచ్చాడు. చివరికీ ఫోన్ కాల్‌కు స్పందించడం లేదు. దీంతో మోసపోయామని గ్రహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

సికింద్రాబాద్: గుండెపోటుతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ నారాయణ వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన చెంగల ఆశిర్లు(64) రెండేళ్లుగా నాగోల్‌లో నివాసముంటున్న తన కుమారుడి వద్ద ఉంటున్నాడు. ప్రతీనెల పెన్షన్ కోసం శ్రీకాకుళంకు వెళ్లి వచ్చే ఆశిర్లు గత నెల 30న శ్రీకాకుళంకు వెళ్లి 4వ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైలు దిగి ఒకటో నంబర్ ప్లాట్ ఫామ్‌లో కాజీపేట్ ఎండ్ సైడ్‌లో కూర్చున్న ఆశిర్లుకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై యుగంధర్ వివరాల ప్రకారం.. నార్త్ లాలాగూడలోని ఇంద్రనగర్ డీ-కాలనీకి చెందిన చంద్రశేఖర్(47) ప్రైవేటు ఉద్యోగి. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ మూడో వార్డు క్లాసిక్ గార్డెన్స్‌లో నియోజకవర్గం పరిధిలోని టీచర్లు, లెక్చరర్లను ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన పొందిన అధ్యాపకులను సైతం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భావితరాలకు విద్యను అందించే ఉపాధ్యాయులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అన్ని పాఠశాలలో ప్రవేశపెట్టి అందరికీ సాంకేతికత పట్ల మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ బాలూనాయక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర ఆఫ్ స్కూల్స్ మదన్‌మోహన్ రెడ్డి, వీరలక్ష్మి, టీచర్స్ యూనియన్ నాయకులు రామ సుబ్బారావు, రిటైర్డ్ టీచర్స్ బిక్షపతి రెడ్డి, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌గౌడ్‌కు నివాళి



రాజ్‌కుమార్‌గౌడ్‌గౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

సనత్‌నగర్: మంచి తనానికి నిలువెత్తు రూపం మూల రాజ్‌కుమార్‌గౌడ్ అని పలువురు నేతలు కొనియాడారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకుడు మూల రాజ్‌కుమార్‌గౌడ్ దశదిన కర్మను నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌గౌడ్‌పై రూపొందించిన వీడియోలు చూసి ప్రతి ఒక్కరూ రాజ్‌కుమార్‌గౌడ్‌తో తమకు ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగాలకు లోనయ్యారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన బండా ప్రకాష్‌ముదిరాజ్, కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్, తలసాని సాయికిరణ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, ఎంఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, మహేశ్వరి, హేమలత రాజ్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం

- రోడ్ల మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపు
- సాక్షితో డీసీ డాకు నాయక్



బన్సీలాల్‌పేట్: గణేష్ నిమజ్జనోత్సవానికి జీహెచ్ఎంసీ తరఫున తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకునాయక్ వెల్లడించారు. ఈ నెల 6న జరిగే నిమజ్జనోత్సవానిక చేసిన ఏర్పాట్లను సాక్షి ముఖాముఖీలో వెల్లడించారు. సర్కిల్ పరిధిలో సంజీవయ్య పార్కు, మారేడ్‌పల్లి ప్లేగ్రౌండ్‌లో రెండు బేబీ పాంట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రేన్‌లతో పాటు తమ సిబ్బంది నిరంతంర అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జనోత్సవ ఊరేగింపు వెళ్లే ప్రాంతాల్లో వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించామన్నారు. ఎక్కడ ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అని శాఖలకు ఆదేశాలు జారీ

ఇటీవల వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేశామన్నారు. రోడ్లు, వీధులు, గణేష్ మండపాల వద్ద చెత్తాచెదారం, వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. రాత్రి వేళల్లో ఎక్కడ కూడా రోడ్లపై చీకటి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని గణేష్ ఊరేగింపు సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు అడ్డు లేకుండా తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే ఉద్యానవన శాఖ సిబ్బంది అనేక ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ పనుల ప్రక్రియను నిరంతరం సాగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్, పోలీసు, జలమండలి ఇతరత్రా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జనాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 10 లక్షల మంది దళితులకు రాజ్యాంగ హక్కులు కల్పించేందుకు అన్ని దళిత సంఘాలు కలిపి ఒక జేఏసీగా ఏర్పాటు చేసుకుని ఎజెండా రూపొందించుకుని ముందుకు పోదామని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు జె.బి.రాజు పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, కార్యదర్శి దావుల రమేష్, సెక్రటరీ జాడి లక్ష్మయ్య మాట్లాడుతూ..గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే ఏజెన్సీ ప్రాంతంలోని దళితులకు అన్ని హక్కులు కల్పించిందని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు అన్ని పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కాని అధికారంలోకి వచ్చి 21 నెలలు అవుతున్నా సమస్యలు పట్టించుకోలేదని, వెంటనే ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్, జేమ్స్, బాలరాజు, ఐలయ్య, సత్యనారాయణ, గంట మల్లేష్, చెన్నయ్య, యాదయ్య, కృపాకర్ పాల్గొన్నారు.